క్లుప్తంగా

డివిజన్ కేంద్రానికి చేరిన బ్యాలెట్ పేపర్లు

మదనపల్లె : ఈనెల 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్‌పేపర్లు సోమవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్ కేంద్రానికి చేరాయి. మంగళవారం వీటిని కస్టోడియల్ అధికారులు పరిశీలించిన తర్వాత స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించనున్నట్లు ఆర్డీఓ ఎం.ఎస్. మురళి తెలిపారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ కేంద్రం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 21 మండలాల నుంచి 23,838 మంది గ్రాడ్యుయేట్ ఓటర్స్, 1,932 మంది టీచర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



పీలేరు : అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక బలిజవీధిలో నివాసం ఉంటున్న లక్ష్మమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో సర్పంచ్ తన సొంత నిధులతో, మానవత సంస్థ సహకారంతో హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రిలు జరిపించారు. కార్యక్రమంలో కృపాల్, గణేష్, షేక్ షాహిన్‌షా, మోదీన్‌బాషా, నాగూర్, షఫీ, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందించే ఉత్తమ వైద్య ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని దేవులపల్లె పంచాయతీలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యసేవల్లో పాల్గొని చికిత్సలు, వైద్యసేవలు అందించారు. మాతా శిశుమరణాలు జరగకుండా రక్త పరీక్షలు చేయించుకుని, అవసరమైన వారు, రక్తం తక్కువగా ఉన్న వారు ఆసుపత్రిలో చేరాలని కోరారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 12 మంది గర్భిణులకు, 21 మంది బాలింతలకు చికిత్స చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, సిబ్బంది రోజా, రమణమ్మ, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత ఆశయంతో చదవాలి

తంబళ్లపల్లె: విద్యార్థులు ఉన్నత ఆశయంతో ప్రణాళిక బద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక మోడల్ స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలుతో పాటు పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. సరస్వతి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్‌కమిటీ చైర్మన్ సలీమ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకు నిధుల మంజూరు

పెద్దతిప్పసముద్రం: మండలంలో గత సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవం అయిన నాలుగు గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ద్వారా రూ.35 లక్షల నిధులు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఈవోఆర్డీ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నవాబుకోట పంచాయతీకి రూ.10 లక్షలు, కాట్నగల్లుకు రూ.10 లక్షలు, మడుమూరుకు రూ.5 లక్షలు, రంగసముద్రం పంచాయతీకి రూ.10 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించండి

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ, రూరల్ మండల పరిధిలో పేదల గృహ నిర్మాణాలు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ శ్రీహరిరావు అన్నారు. సోమవారం గృహనిర్మాణశాఖ కార్యాలయంలో ఏఈలు లావణ్య, సరోజ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ అలీఖాన్‌లతో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూఫ్‌లెవల్‌లోని ఇళ్లను వెంటనే పూర్తి చేయించాలని కోరారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. ఉగాదికి గృహప్రవేశాల కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ డిపో–1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డిపో గ్యారేజీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆదాయం పెంచుకునేందుకు అందరూ కలిసి పని చేయాలన్నారు. ఎక్కువ కెఎంపిఎల్ తెచ్చిన డ్రైవర్ రఫీని అభినందించారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

- పేదల పాలిట వరంగా ఫ్యామిలీ ఫిజిషియన్
- గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు

వాల్మీకిపురం: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలకు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు వెళ్లేవారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలులోకి వచ్చిన తరువాత నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. గతంలో ఏ చిన్న జబ్బు చేసినా, పెద్ద జబ్బు చేసినా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరుగెత్తేవారు, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిర్దేశిత సమయంలో గ్రామాల్లో వైద్య బృందం వచ్చి రోగులను నిశితంగా పరీక్షలు చేసి అందుకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఈ వైద్య బృందాలు వచ్చేటప్పటికీ విశేష స్పందన కనిపిస్తోంది. పీలేరు నియోజకవర్గంలో 72 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు వైద్య సేవలు పొందుతున్నారు. దింతో పేదలు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న దీమా కనిపిస్తోంది.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

షుగర్, బీపీ పేషెంట్లకు భరోసా

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ వంటి రోగాలు పట్టిపీడిస్తున్నాయి. వీటి వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాలు మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం. ఇప్పుడు ప్రభుత్వమే వైద్యులను పంపించి ప్రతి నెలా రక్త, యూరిన్ తదితర పరీక్షలు చేయిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పీలేరు నియోజకవర్గంలో 9800 మంది షుగర్, బీపీ రోగులకు సేవలు అందుతున్నాయి.

మండలాల వారీగా వైద్య సేవలు

మండలం	వైద్య శిబిరాలు	రోగులు
వాల్మీకిపురం	12	1200
కలికిరి	13	1700
కలకడ	10	1050
కెవిపల్లి	10	1200
గుర్రంకొండ	13	1650
పీలేరు	14	3000

మెరుగైన వైద్యం



వయసు మీద పడడంతో ఒళ్లు నొప్పులు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ప్రతి నెలా ఫ్యామిలీ ఫిజీషియన్ పుణ్యమా అని ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించి, మందులు ఇస్తున్నారు. జీవితంపై ఆశ కలుగుతుంది. ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.
- ద్వారకనాథ రెడ్డి, కోటపల్లి, చింతపర్తి

ప్రతి నెలా పరీక్షలు



ప్రతి నెలా వైద్య బృందం గ్రామానికి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే వస్తున్నారు. జబ్బు ఉందని బెంగతో చచ్చేవాళ్లం. ఇప్పుడు భయం లేదు. దీంతో ఆరోగ్యంగా ఉంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.
- రెడ్డెప్ప, పెరుమళ్లయ్యగారిపల్లి

అందుబాటులో ఉంటున్నాం



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్‌కు వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు అందుబాటులో ఉన్నారు. గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.
- శ్రీవిద్య, వైద్యాధికారి

హైవే రోడ్డుకు అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలి

– సబ్‌కలెక్టరేట్ డీఏఓకు రైతుల వినతి

మదనపల్లె : మదనపల్లె–తిరుపతి ఫోర్‌లేన్ హైవే నిర్మాణంలో భాగంగా వేస్తున్న రోడ్డుపై కొత్తవారిపల్లె, పోతపోలు గ్రామస్తులకు అనుకూలంగా సీటీఎం పెద్దచెరువు ఆయకట్టు భూములకు వెళ్లేందుకు అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని రైతులు విన్నవించారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో రైతులు డీఏఓ శేషయ్యను కలిసి తమ సమస్యను విన్నవించారు. కొత్తవారిపల్లె, పోతపోలు గ్రామాలకు చెందిన రైతులకు సీటీఎం పెద్దచెరువు ఆయకట్టు కింద సుమారు 1,000 ఎకరాల వరకు భూములున్నాయని, హైవే నిర్మాణంతో అటువేపు వెళ్లేందుకు దారిసౌకర్యం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే హైవే నిర్మాణంలో భాగంగా చెరువులో నీరు వృథా చేస్తున్నారని, దీనిని నమ్ముకుని ఆయకట్టు కింద వరి పంట వేసిన రైతులు నీళ్ల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పుకొచ్చారు. చెరువుకింద నీటికాలువలు ఏర్పాటు చేయాలని, పూడ్చేసిన కాలువలు నిర్మాణం జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మునిరాజ, నరసింహులు, రామకృష్ణారెడ్డి, నాగార్జున, శేఖర్‌రెడ్డి, సుభద్రమ్మ, రాధమ్మ, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



సబ్ కలెక్టరేట్ డీఏఓ శేషయ్యకు విన్నవిస్తున్న రైతులు

విజయవంతంగా ముగిసిన కరాటే పోటీలు

పీలేరు రూరల్ : మండలంలోని మొరవపల్లె శ్రీవారి కల్యాణ మండపంలో నిర్వహించిన యోదా నేషనల్ కరాటే పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఆది, సోమవారం జరిగిన పోటీల్లో మొత్తం 14 టీములు, సుమారు 400 మంది విద్యార్థులు, మాస్టర్స్ కరాటే పోటీల్లో పాల్గొన్నారు. యోదా ఓపెన్ కటాచ్ చాంపియన్‌షిప్‌లో పి. సతీష్ మొదటి బహుమతి సొంతం చేసుకున్నాడు. ఓపెన్ ఫైట్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన ప్రేమ్ మొదటి బహుమతి, మదనపల్లెకు చెందిన పి. సతీష్ ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్నారు. సూపర్ కిడ్స్ ఈవెంట్స్‌లో నుషరోషిణి గోల్డ్‌మెడల్ సాధించారు. అలాగే కట, టీమ్‌కట, కుమ్మితే విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పీలేరు యోదా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ జి. ఇనాముల్‌హక్, కరాటే మాస్టర్లు ఖాదర్, శ్రీనివాసులు, మురళి, సతీష్, నరేష్, అమర్, ఫాహీం, మహిత, పి. సతీష్, హర్ష, పట్టాభి, కేశవ, ఉమర్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

క్షయవ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు

పీలేరు : క్షయవ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నట్లు పీలేరు టీబీ యూనిట్ క్షయ నివారణాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలో ప్రభుత్వాస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు చైతన్యరెడ్డి తనవంతు సహాయంగా టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి మైక్రో బ్యాక్టీరియమ్ ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియాతో గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఒకట్రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, ఆకిలి లేకపోవడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, గళ్లలో రక్తం పడడం టీబీ లక్షణాని తెలిపారు. లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వాస్పత్రిలో సంప్రదిస్తే ఉచితంగా గళ్ల పరీక్షలు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సూపర్ వైజర్స్ మోహన్, పవన్‌కుమార్, భార్గవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



టీబీపై అగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హనుమంత వాహనంపై వేంకటరమణుడు

రామసముద్రం: మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని హనుమంత వాహనంపై వైభవంగా ఊరేగించారు. ఈ వాహన సేవ ప్రతి ఏటా వాల్మీకి కులస్తులు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచినే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు రామచంద్ర బట్టర్ తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి స్వామివారిని గ్రామ పురవీధుల్లో బ్యాండువాయిద్యాల నడుమ , చక్కభజనలు కోలాటాలతో పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీస్వామి వారికి ఇంటింటా మహిళలు కర్పూర హారతులు అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి భక్తుల కాలక్షేమం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



చెంబకూరులో హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఎమ్మెల్యే పరామర్శ

వాల్మీకిపురం: పట్టణంలోని హసన్‌ఖాన్‌వీధికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మస్తాన్ బేగ్ (48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్ తదితరులు ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

నిమ్మనపల్లె : వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ జులేఖా బేగం అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లె వారపుసంత వద్ద ఓఆర్ఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులతో పాటు ప్రజలు వడదెబ్బ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా ఓఆర్ఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎండలో ఎక్కువగా తిరగడంతో డీహైడ్రేషన్‌కు గురై సొమ్మసిల్లిపోవడం జరుగుతుందన్నారు. అనంతరం వృద్ధులకు ఓఆర్ఎస్ ద్రావణం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రామచంద్ర, సీహెచ్ఓ మల్లిక, పీహెచ్ఎన్ సరోజ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖాబేగం

క్రికెట్ మైదానం ప్రారంభం

వాల్మీకిపురం: స్థానిక జీవీఎస్‌సీఎస్ క్రికెట్ మైదానాన్ని సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం క్రికెట్ క్యాంపు, గ్రౌండ్ డెవలప్‌మెంట్ చేస్తామన్నారు. మదనపల్లి డివిజన్ క్రీడాకారులు అవకాశాన్ని ఉపయోగించుకొని రంజీ, ఇండియా లెవెల్ ఆడాలని సూచించారు. మదనపల్లి డివిజన్ నుంచి మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ సునీల్ కుమార్, ఫౌండర్ శ్రీధర్, సభ్యులు శ్రీనివాసులు, గిరి ప్రకాష్, సతీష్, ఖాదర్ బాబా, భరత్, షహీద్, రెడ్డి, ముజీర్, ఇర్ఫాన్, రామక్రిష్ణ, జాకీర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ఆర్టీసీ సేవలు

తంబళ్లపల్లె: ప్రముఖ శైవక్షేత్రం మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత ఆలయానికి ప్రతి సోమవారం భక్తులు అధికంగా వస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లె వన్‌డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి రెండు బస్సు సర్వీసులను ప్రతి సోమవారం తిరిగేలా చర్యలు చేపట్టారు. ఈ బస్సులు కొండపైకి సాయంత్రం వరకు తిరిగాయి. మల్లయ్యకొండపై భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరమ్మపుట్టలో వెలసిన గౌరమ్మతల్లికి ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వచ్చిన భక్తులందరికీ సౌకర్యాలు కల్పించారు.

పట్టణంలో వీధికుక్కల పట్టివేత

మదనపల్లె : పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉన్న నేపథ్యంలో వాటికి సంతాన నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు వీలుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కుక్కల పట్టివేతను ప్రారంభించినట్లు కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. తిరుపతికి చెందిన అనిమల్ కేర్ ల్యాండ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అనిమల్ బర్త్ కంట్రోల్(డాగ్స్) రూల్స్ 2001ను అనుసరించి కుక్కలకు సంతాననియంత్రణ చికిత్సతో పాటుగా, యాంటి రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వి) నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని సీటీఎంరోడ్డు, ఇందిరానగర్, కృష్ణానగర్, జ్యుడిషియల్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌లో సుమారుగా 80 కుక్కలను పట్టామని, త్వరలోనే వీటికి శస్త్రచికిత్స నిర్వహిస్తామన్నారు.



జ్యుడిషియల్ కాలనీలో కుక్కలను పడుతున్న మున్సిపల్ సిబ్బంది

శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం

కలికిరి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, మండల పరిధిలోని గ్రామా సచివాలయాల్లో నేరుగా పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు మార్కు చేయాలని, నమూనా బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, ఎస్టీడి హరి, నాయకులు జయప్రకాష్ రెడ్డి(బాబు) ద్వారకనాథ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, బావాజీ, ఇస్తియాక్ అహ్మద్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాపేపల్లెలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెద్దమండ్యం: తూర్పు రాయలసీమ (ప్రకాశం, నెల్లూరు,చిత్తూరు) పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డినికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని పాపేపల్లె, సీ గొల్లపల్లె గ్రామాల్లో సోమవారం ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను కలిశారు. మొదటి ప్రాధాన్యత ఓటు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణ చంద్రిక, మండల సచివాలయాల కన్వీనర్ కన్నపు రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు విశ్వనాథ, విశ్వనాథరెడ్డి, నాయకులు కోసూరి రామక్రిష్ణ, కేశవ,మధు, అమర, ప్రభాకర్ పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

పెద్దతిప్పసముద్రం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరచిన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు కోరారు. సోమవారం ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సచివాలయ మండల సచివాలయ కన్వీనర్ డ్రిప్ రమణ, కన్వీనర్ సుబ్బరాం, నాయకులు భాస్కర్‌నాయుడు, ఆనందరెడ్డి, పప్పు రాజారెడ్డి, బాబురెడ్డి, జయచంద్రారెడ్డి, సవరాల రవి శంకర్, శివ, రామక్రిష్ణ, సుబ్రమణ్యంలు మండలంలోని మడుమూరు, రంగసముద్రం, రాపూరివాండ్లపల్లి పంచాయతీల్లో పర్యటించి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

వైభవంగా ధ్వజారోహణం

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున ఏకశిల గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, తీర్థ ప్రసాదాలతో ఉభయదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజారోహణం వైభవంగా జరిగింది. పగలు గ్రామోత్సవం, రాత్రి హనుమంత వాహనంపై స్వామివారి ఊరేగింపు జరిగింది. ఉత్సవ మూర్తులను పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. వాహన సేవలో వైఎస్సార్ సీపీ నాయకులు బోడిమాని రామిరెడ్డి, నరసింహులు, పప్పుశెట్టి వెంకట్రమణ, పీరాన్‌సాబ్, ఉభయదారులు కుమార్‌నాయుడు, నాగనరసింహులు నాయుడు పాల్గొన్నారు.

పెద్దచెరువు కబ్జాపై విచారణ జరిపించాలని ఆందోళన

మదనపల్లె : సీటీఎం పెద్దచెరువు కబ్జాపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు సబ్ కలెక్టరేట్‌లో సోమవారం నిరసన తెలిపారు. సీటీఎం పెద్దచెరువులో రియల్టర్ ప్రభుత్వ భూమిని ఎంత కబ్జాచేశాడనే విషయమై తహసీల్దార్ రోజుకొక సమాచారం ఇస్తున్నారన్నారు. గతంలో తహసీల్దార్ ఆక్రమణ విషయమై అడిగినప్పుడు 3.5 ఎకరాల పట్టా భూమి ఉందని చెప్పారని, ప్రస్తుతం సీపీఐ నాయకులు అడిగితే 10 ఎకరాలు వారికి పట్టా ఉందని చెప్తున్నారన్నారు. తహసీల్దార్ మాటలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, గతంలో కబ్జాచేసింది కేవలం 20 సెంట్లేనని, మిగిలినది పట్టాభూమిగా పేర్కొన్నారన్నారు. ఆక్రమణల తొలగింపులో మాత్రం అర ఎకరాకు పైగానే ఆక్రమణ జరిగిందని గోడ ధ్వంసం చేశారన్నారు. సీటీఎం పెద్దచెరువు విషయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీ వేసి సమగ్రవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణప్ప, కృష్ణమూర్తి, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మదనపల్లె సిటీ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలపై అవగాహన కలిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూఈసీ కో ఆర్డినేటర్ వనజ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు భవానీదేవి,జ్యోతి, నమ్రత, ఖాజావలి, పారా లీగల్ వలంటీర్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి

వృద్ధులు, విద్యార్థులకు పండ్లు పంపిణీ

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువు మిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాల విద్యార్థులు, వృద్ధులకు సోమవారం విశ్వం డిగ్రీ కాలేజీ విద్యార్థులు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు. వృద్ధాశ్రమంలో వృద్ధులను అప్యాయంగా పలకరించారు. చదువుతో పాటు సేవా గుణాన్ని అలవాటు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామమూర్తి, గుడ్‌విల్ కంప్యూటర్స్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బదులు బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నాకక్షిదారులైన గాలిపూర్ణానంద చౌదరి తండ్రి గాలి సుబ్రమణ్యం చౌదరి డోర్ నెం.5-69/38/2, సరస్వతి నగర్, తిరుపతి మరియు గుండ్లూరు నారాయన రెడ్డి తండ్రి జి.భాస్కర్ రెడ్డి డోర్ నెం.7-128/2, శ్రీనగర్ కాలనీ, అవిలాల తిరుపతి రూరల్ మండలము మరియు జిల్లా అను వారి తరపున ఈ క్రింద కనిన షెడ్యూల్ ఆస్తిని మదనపల్లె వాస్తవ్యులయిన మార్పూరి వెంకటేశులు తండ్రి లేట్ యం.క్రిష్ణమూర్తి గారు Registered G.P.A. Doc.No.629/2023 Dt.27/01/2023 న కోనేటి సులోచన గారికి షెడ్యూలు ఆస్తిని వ్రాయించి ఇచ్చినారు. సదరు ఏజెంట్ అయిన కె.సులోచన గారు 15.02.2023న విక్రయ దస్తావేజు నెం.881/2023 ద్వారా రూ.25800000/- అక్షరాల రెండుకోట్ల యాభై ఎనిమిది లక్షల రూపాయిలకు నాకక్షిదారులకు శుద్ధ విక్రయ పత్రం ద్వారా అమ్మియున్నారు. పైకనిన విక్రయము మొత్తము ప్రిన్సిపాల్ అయిన మార్పూరి వెంకటేశులుకు వాస్తవ విషయములు అన్నియు తెలుసును.

ఇది ఇలా వుండగా ప్రిన్సిపాల్ యం.వెంకటేశులు 25.02.2023న ప్రముఖ దినపత్రిక నందు ఒక బహిరంగ ప్రకటన ఇచ్చియున్నారు. సదరు ప్రకటన నా కక్షిదారులకు ఆర్థికంగా మరియు పరువుకు భంగం కలిగేవిధంగా ఒక ప్రకటన ఇచ్చియున్నారు. నాకక్షిదారులు అన్ని మూలపత్రాలను మరియు ఆస్తిని తనిఖీ చేసిన తర్వాతనే ఈ క్రింద కనిన షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేసివున్నారు.

నా కక్షిదారుల మీద మార్పూరి వెంకటేశులు మరియు కోనేటి సులోచన గారు ఒక బహిరంగ ప్రకటన ఇచ్చినందులకుగాను వారి మీద చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబడును. కావున యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ ప్రకటనను ఎవరూ నమ్మవద్దని తెలియపరుచున్నాము. క్రింద షెడ్యూలు ఆస్తి నా కక్షిదారులకు పై కనిన విక్రయ పత్రం ద్వారా సంపూర్ణ హక్కులు కలిగివున్నవి.

షెడ్యూలు

Annamayya District, Madanapalle, Sub-District, Madanapalle Mandal, Madanapalle Municipality Area, Ponnetipalem Village Accounts, Jaya Bharath Public School Area, Sy.No.420/10 which is Sub-Divided as Sy.No.420/10a, 420/8b, 420/12b, 420/10b1 and 420/14 out total extent of A.c 9.90 cents an extent of Ac1.75 cents with following boundaries.

East : Lands of sold by Marpuri Venkatesh
west : 22 feet Road
North : others land
South : Vanka

within these Boundaries an Extent of AC1.75 cents or 8470.01 square yards

K.SREENIVASULU
ADVOCATE, TIRUPATI